క్లుప్తంగా

బీమా సాయం అందజేత


మృతుని భార్యకు నగదు అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక గడ్డవీధిలో నివాసం ఉంటున్న చాకలి నాగన్న అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓపీఆర్‌డీ రాధిక, గ్రామ సచివాలయ కన్వీనర్లు దశరథరామిరెడ్డి, పద్మావతమ్మ ఆధ్వర్యంలో మృతుని భార్య మహేశ్వరికి తక్షణ సాయంగా రూ. 10వేలు అందజేశారు. మిగిలిన మొత్తం రూ. 90 వేలు త్వరలో నామిని ఖాతాలో జమ అవుతుందని వెల్ఫేర్ అసిస్టెంట్ పూర్ణచంద్ర తెలిపారు.

సేవా గుణం అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ నరసింహారెడ్డి చెప్పారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల పంపిణీ శుక్రవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, సభ్యులు సుబ్బయ్య, రాములమ్మ పాల్గొన్నారు.

పెద్ద వెంతుర్ల సర్పంచ్‌గా లక్ష్మీదేవి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెద్దవెంతుర్ల గ్రామ పంచాయితీ సర్పంచ్ పదవికి శిరియపురెడ్డి పద్మాంజలిదేవి ఇటీవల అనారోగ్య కారణాలతో రాజీనామా చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్ శిరియపురెడ్డి లక్ష్మీదేవికి సర్పంచ్ బాధ్యతలు అప్పగిస్తు ఎంపీడీఓ సాయి కృష్ణ ధ్రువీకరణ పత్రం అందజేశారు.

డైరీల ఆవిష్కరణ

డోన్ : ఎస్అండ్ ఎస్ పబ్లికేషన్ అధినేత మాకం శేషు సహకారంతో క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ రూపొందించిన నూతన సంవత్సర డైరీలను పాస్టర్లు నిత్యానందం, యోహాన్ చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు శ్యాంసన్, రాజు, ప్రవీన్‌కుమార్, దేవదాసు, సాలోమోన్, జాన్ ప్రభాకర్, కమిటీ అధ్యక్షుడు ఆదాం, ఉపాధ్యక్షుడు ప్రవీన్‌కుమార్, కార్యదర్శి జాన్సన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

20న వాల్మీకి యువగర్జన సభ

బేతంచెర్ల: వాల్మీకి యువసేన ఆధ్వర్యంలో ఈనెల 20న కర్నూలులో జరిగే వాల్మీకి యువ గర్జన సభను విజయవంతం చేయాలని సేన రాష్ట్ర అధ్యక్షులు వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం వాల్మీకి యువసేన మండల ప్రధాన కార్యదర్శి నాయిని రామకృష్ణ ఆధ్వర్యంలో వాల్మీకి యువగర్జన సభ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటిస్వామి, మద్దయ్య, వెంకటేశ్వర్లు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభ

ప్యాపిలి: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా వైద్యాధికారి వెంకటరమణ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలను అందరం కృషి చేద్దామన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి

బేతంచెర్ల: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమని, ప్రతిఒక్కరూ సహకరించాలని మేజర్ గ్రామ పంచాయతీ సిమెంట్ నగర్ సర్పంచ్ ఏస్తేరమ్మ, ఉప సర్పంచ్ మమత తెలిపారు. మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో 2024–25 గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి ఆశయ్య, సచివాలయ కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. అభివృద్ధి పనులను వివరించడంతోపాటు చేపట్టాల్సిన పనులపై చర్చించారు.

తప్పిన ప్రమాదం

డోన్ టౌన్ : డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం బేతంచెర్లకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఒక ఐచర్ వాహనం ఆర్టీసీ బస్సుపైకి దూసుకొచ్చింది. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ వెంటనే రోడ్డు సైడుకు తిప్పడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో ఏలాంటి ప్రమాదం చోటు చేసుకోక పోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రూ.38 లక్షల ఆదాయం

బనగానపల్లె రూరల్ : యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలోని హుండీ లెక్కింపు ద్వారా రూ.38,09,924 ఆదాయం వచ్చిందని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ పర్యవేక్షణాధికారి శశికుమార్, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో భక్తులు గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకు హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు.

పల్లెకు ఎల్‌ఈడీ కాంతులు !

- సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో మెరుస్తున్న బస్టాండ్ రోడ్డు
- రూ.8 కోట్లతో రోడ్డు విస్తరణ
- విశాలంగా మారిన ప్రధాన రహదారి




ఎల్ఈడీ లైటింగ్‌తో కొత్తగా కనిస్తున్న ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు

బనగానపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధి బాటపట్టింది. బనగానపల్లె పట్టణంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరువతో అభివృద్ధి పరుగులు పెడుతుంది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి వర్గీయులు కోర్టు కెళ్లి అడ్డుకోవడంతో ఇళ్ల పట్టాలు పంపిణీ నిలిచిపోవడం మినహా బనగానపల్లె పట్టణ ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందడంతోపాటు అభివృద్ధి పనులు విస్తృతంగా జరిగాయి. ప్రత్యేకించి ప్రధాన నంద్యాల రహదారి విస్తారంగా దర్శనమిస్తుంది. రూ.8 కోట్లతో ఫోర్‌లైన్స్‌తో పాటు సెంట్రల్‌లైటింగ్‌కు ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటు హైలెట్‌గా నిలిచింది. దీంతో పల్లెలో కొత్తశోభ నెలకొంది. స్థానిక ప్రభుత్వ అతిథి గృహం నుంచి ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ వైద్యశాల, ఎంపీడీఓ కార్యాలయం మీదుగా జీఎం టాకీస్ వరకు ఉన్న ప్రధాన రోడ్డు ఫోర్‌లైన్‌గా విస్తరించారు. రోడ్లు విశాలంగా మారడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. పల్లెతోపాటు గ్రామీణ ప్రజలు సైతం సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పెట్రోల్ బంక్ సెంటర్ కళకళ

ప్రధాన రహదారిలోని పెట్రోట్ బంక్ సెంటర్ నేడు కళకళలాడుతుంది. గతంలో ఈ రోడ్డు నిత్యం రద్దీగా రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. అడ్డదిడ్డంగా రాకపోకల మూలంగా ప్రమాదాలు జరిగి గొడవలు జరిగిన సంఘటనలు కోకొల్లలు. ఎన్నోసార్లు ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు ఇబ్బందులు పడ్డారు కూడా. ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరువతో ప్రధాన రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి జీఎం టాకీస్ వరకు రహదారిని పూర్తిగా విస్తరించారు. ఇందుకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు నిర్వహించుకునే వ్యక్తులు సైతం ఎమ్మెల్యేకు పూర్తిగా సహకరించారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకున్నారు. దీంతో నేడు ఫోర్‌లైన్ రోడ్డు విశాలంగా మారింది.


ఎల్ఈడీ కాంతులతో వెలుగుతున్న ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు

ట్రాఫిక్ సమస్య తీరింది



ఏళ్లతరబడి బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో సతమతమయ్యాం. ప్రత్యేకించి పెట్రోల్ బంక్ దగ్గర చాలా ఇబ్బందులు పడ్డాం. ఎన్నోసార్లు అక్కడ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య తీరింది. ఫోర్‌లైన్స్ ఏర్పాటుతో ప్రయాణం సాఫీగా సాగుతుంది. ప్రత్యేకించి సెంట్రల్ ఎల్ఈడీ సౌకర్యం ఏర్పాటుతో కొత్తశోభ సంతరించుకుంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు.
– అబ్దుల్‌ఫైజ్, బనగానపల్లె

పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే కాటసాని కృషి



బనగానపల్లె పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అంకితభావంతో కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే చొరువతోనే రోడ్లు పక్కన వ్యాపారదారులు స్వచ్ఛందంగా కట్టడాలను తొలగించుకున్నారు. దీంతో రహదారి విశాలంగా మారింది. రోడ్డు తీరే మారిపోయింది. రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్‌తో బస్టాండ్ రోడ్డు రాత్రి వేళలో సైతం పట్టపగలను తలిపిస్తుంది. చాలా సంతోషంగా ఉంది.
– సజ్జాద్‌హుస్సేన్, బనగానపల్లె

నేడు సర్వసభ్య సమావేశం

డోన్ రూరల్ : పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నందు శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

నేడు పెంచిన పింఛన్ ఉత్సవం

బనగానపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో శనివారం పెంచిన పింఛన్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. మండలానికి 191 కొత్త పింఛన్ల మంజూరయ్యాయన్నారు. వృద్ధాప్య 72, వితంతు 97, దివ్యాంగులు 21, ఓ ఒంటరి మహిళకు పెంచిన పింఛన్ రూ. 3వేలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు.

మార్కెట్ ధరకే కందులు కొనుగోలు

డోన్ టౌన్ : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ మార్కెట్ ధరకే కందులు కొనుగోలు చేస్తోంది. కందులను నా ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు డోన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజా నారాయణమూర్తి తెలిపారు. రైతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పొలం పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలతో మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఓటు వజ్రాయుధం లాంటిది

బేతంచెర్ల: ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో ఎన్నికలలో అత్యధికంగా ఓటు వేసిన సీనియర్ సిటిజన్లను తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి సత్కరించారు. ఈసందర్భంగా ఓటు యొక్క ఆవశ్యకతను తహసీల్దార్ వివరించారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలి


వివరాలు సేకరిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

కొలిమిగుండ్ల: గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ సాయికృష్ణ ఆధ్వర్యంలో ఉపాధి పనులకు సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 23 గ్రామ పంచాయితీల్లో 2020 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ.4.60 కోట్లతో గ్రామాల్లో వివిధ రకాల ఉపాధి పనులు, సచివాలయ భవన నిర్మాణాలు తదితర పనులు చేపట్టారు. అలాగే మెటీరియల్ కింద రూ.1.60 కోట్లు ఖర్చు చేశారు. ఈ పనులపై క్షేత్ర స్థాయిలో డీఆర్పీలు తనిఖీలు చేశారు. పనుల్లో కొలతల తేడా ఉన్నట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మస్టర్లలో కూలీలు పనులకు రాకుండానే వచ్చినట్లు చూపించారు. హార్టికల్చర్ కింద రైతులు ఉద్యాన పంటల సాగు విషయంలో కొన్ని చోట్ల తప్పులు దొర్లినట్లు గుర్తించారు. మండల వ్యాప్తంగా రూ.35వేలు దుర్వినియోగం కావడంతో సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేసినట్లు పీడీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సాంబశివరావు, జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజీ, ఎస్సార్పీ కన్నారెడ్డి, ఏపీఓ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

బేతంచెర్ల: పేద ప్రజలకు అండగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన అందిస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ డైరక్టర్ ముర్తుజావలి తెలిపారు. మండలానికి చెందిన నలుగురికి మంజూరైన రూ. 3.60 లక్షల చెక్కులను వైస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ అందజేశారు. బేతంచెర్ల పట్టణానికి చెందిన పాపసాని రామిరెడ్డి , సద్దల వెంకట రామిరెడ్డి రూ. 2.40 లక్షలు, గోరుమానుకొండ తండాకు చెందిన సేనావత్ మల్లయ్య నాయక్ రూ. 70 వేలు, ముసలాయి చెర్వు గ్రామానికి చెందిన మిడుతూరి రాంభూపాల్ రెడ్డి రూ. 50 వేలు చొప్పున మంజూరైంది. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితోపాటు నాయకులకు ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు గూని నాగరాజు, శేఖర్‌రెడ్డి, బుగ్గన కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీషర్ట్‌లు అందజేత


టీషర్ట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్ : ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా సచివాలయ స్థాయిలో ప్రతిభచాటి మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ప్రభుత్వం సరఫరా చేసిన టీషర్టులను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ రేగటి రాజశేఖర్ అందజేశారు. క్రీడాకారులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని, గ్రామీణ స్థాయిలోనూ వారి ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా ఎంపీపీ గుర్తు చేశారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె రూరల్ : రెండవ విడత భూ రీసర్వే జరిగిన గ్రామాల్లోని రైతులు గ్రామ సభలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కిశోర్ కుమార్ రెడ్డి అన్నారు. బత్తులూరుపాడు, మీరాపురం గ్రామాల్లో గ్రామ సభలు శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో అభ్యంతరాలు ఉంటే గ్రామ సభల ద్వారా రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ నర్సిరెడ్డి, సర్వేయర్ గాయత్రి, ఆర్ఐ రాఘవేంద్ర, వీఆర్‌వోలు గోపాల్ రైతులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని ఊటకొండకు చెందిన రైతు గంగరాజు (60) శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సొంత పొలంలో గొర్రెలు మేపుకుంటున్న గంగరాజు వాటికి నీళ్ల తాపేందుకు మోటార్ ఆన్ చేయడానికి వెళ్లాడు. ఆన్ కాకపోవడంతో ఫ్యూజ్ వేసే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మహేశ్వరి కుమారుడు, కూతురు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు జలదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు. గాజ రాములమ్మ నుంచి 9 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

రీ సర్వేతో శాశ్వత భూ హక్కు

డోన్ టౌన్ : జగనన్న భూ హక్కు పథకం ద్వారా రీ సర్వే చేసి రైతులకు శాశ్వత భూ హక్కు కల్పిస్తున్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని ఎస్.గుండాల గ్రామంలో రీ సర్వేపై శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జగదీష్‌కుమార్, గ్రామ రెవిన్యూ అధికారి గోవిందు, పంచాయితీ కార్యదర్శి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు గిడ్డారెడ్డి పాల్గొన్నారు.

బాలికల విద్యతో సమాజాభివృద్ధి

డోన్ టౌన్ : బాలికల విద్యతో సమాజం అభివృద్ధి చెందుతుందని కేజీబీవీ ప్రత్యేక అధికారి జోషి,యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కేజీబీవీ పాఠశాల్లో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబు, సుబ్బరాయుడు, మాణిక్యంశెట్టి, గోపాల్, సంజీవరాయుడు, టీచర్లు సుజాత, లక్ష్మీ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ


పింఛన్ సొమ్ము అందజేస్తున్న మేకల విమల

డోన్ : వైఎస్ఆర్ పింఛన్ కానుక పెంపు ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు రూ.3వేలకు పింఛన్‌ను ప్రభుత్వం పెంచింది. ఈ సందర్భంగా ఇందిరానగర్‌లోని 29వ వార్డు పరిధిలో 8 మంది కొత్త లబ్ధిదారులకు రూ.3వేలను కౌన్సిలర్లు మేకల విమల, మాజీ కౌన్సిలర్లు ధారా ప్రతాప్‌రెడ్డి, మేకల నాగరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంగస్వామి, మహేష్, విజయ్, శివ, సాయన్న, డీలర్ క్రిష్ణ, వార్డు వెల్ఫేర్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని 13వ వార్డుతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ టీఈ లక్ష్మీదేవి, కౌన్సిలర్ దినేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నలుగురు కొత్త పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.


పింఛన్ కానుకను అందజేస్తున్న వెంకటేశ్వర్లు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండలో పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నాగార్జున ఆధ్వర్యంలో సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు చేతుల మీదుగా వైఎస్సార్ పింఛన్ పెంపు వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ పింఛన్ కానుకను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గ్రామ సభను నిర్వహించారు. ఆర్ కొత్తపల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ మహాలక్ష్మి, ఎంపీటీసీ మునేశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు చల్లా బలరాముడు ఆధ్వర్యంలో వైఎస్సార్ పెన్షన్ కానుకను అందజేశారు.


పింఛన్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ దినేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీదేవి

అనంతపురం వెళ్లి పింఛన్ అందజేత


చికిత్స పొందుతున్న మహాలక్ష్మితో బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ నాగరాజు

కొలిమిగుండ్ల: బెలుం గ్రామానికి చెందిన పిక్కిలి మహాలక్ష్మి వారం రోజుల క్రితం కింద పడటంతో కాలు,చేయి విరిగి అనంతపురంలోని ఓప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. జనవరి నెల పింఛన్ సొమ్ము రూ.3వేలను వలంటీర్ నాగరాజు అక్కడికి వెళ్లి ఆసుపత్రిలో లేవలేని స్థితిలో ఉన్న మహాలక్ష్మి అందజేశాడు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన


కోవెలకుంట్ల: వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు

కోవెలకుంట్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని మూడవ గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నంద్యాలకు చెందిన ప్రముఖ డాక్టర్లు పవన్‌కుమార్, హరికృష్ణ, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్లు రాబర్ట్ కెన్నెడి, అశోక్, ఆప్తాలమిక్ అసిస్టెంట్ గంగాధర్, తదితరులు 448 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు చేశారు. సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, పాండురంగస్వామి దేవాలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాధిక, మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ గోపినాథ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె గ్రామ సచివాలయంలో శుక్రవారం అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు 200 మందికి వైద్య సేవలు అందజేశామని డాక్టర్ ప్రియాంక తెలిపారు. డాక్టర్లు చంద్ర శేఖర్ రెడ్డి, మేఘన, పంచాయితీ కార్యదర్శి రాజు,సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లె గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యులు హరిచరణ్‌రెడ్డి, జయరాం, సుష్మ రోగులకు బీపీ, షుగర్, జ్వరం, నొప్పులు తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గొర్విమానుపల్లె, కొండమీదపల్లెకు చెందిన 620 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 45 మంది వృద్ధులకు ప్రభుత్వం మంజూరు చేసిన కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ సాయికృష్ణ వైద్య శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు.


లింగందిన్నె : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్


గొర్విమానుపల్లె : మందులు అందజేస్తున్న సర్పంచ్ రామాంజనేయులు, వైద్య సిబ్బంది

ఆరోగ్య సురక్షను సక్రమంగా నిర్వహించాలి

ప్యాపిలి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, స్పెషల్ ఆఫీసర్ మురళీధర్ రెడ్డి ఆదేశించారు. స్థానిక ఒకటో సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరానికి వచ్చే రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత వ్యాధి తీవ్రత మేరకు వారిని సమీపంలోని ఆసుపత్రులకు సిఫారసు చేయాలని ఆయన సూచించారు.


వైద్య పరీక్షల నమోదు వివరాలను పరిశీలిస్తున్న వెంకటరమణ

ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్


కార్మిక నాయకులతో చర్చిస్తున్న సప్తశైల రాజేష్

డోన్ : సమస్యల పరిష్కారానికి కార్మికులు సమ్మె శాంతియుతంగా కొనసాగించాలే తప్పా ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. శుక్రవారం చైర్మన్ తన కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సర్వీసుల కింద మంచినీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించేందుకు మున్సిపాలిటీ ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టిందన్నారు. అయితే సమ్మెలో ఉన్న కొందరు ప్రజలకు ఈ సౌకర్యాలు అందకుండా అడ్డుకుంటుండడం భావ్యం కాదన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగజేయమని కార్మిక నాయకులు చైర్మన్‌కు హామీనిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రంగనాయుడు, నాయకులు లక్ష్మినారాయణ, పుల్లయ్య, సీఐటీయూ నాయకులు శివరాం, భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు పసాద్, డీఈ రసూల్, ఏఈ సురేష్, కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, రైల్వే నాగేంద్ర, సుంకయ్య, కుళ్లాయి తదితరులు పాల్గొన్నారు.

చండీయాగం ప్రారంభం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి దీక్ష విరమణ సందర్భంగా శుక్రవారం చండీ యాగం ప్రారంభమైంది. ఈఓ రామానుజన్, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవా నిర్వహించారు. ఈ నెల 7వ తేదిన పూర్ణహుతితో చండీయాగం ముగుస్తోందని ఈఓ రామానుజన్ తెలిపారు.